మంచి వైద్యం అందించాలని..

రాచకొండలో ఇన్‌స్పెక్టర్లు బదిలీ

జూబ్లీహిల్స్, జనవరి 18 :రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం పలువురు ఇన్‌స్పెక్టర్‌లకు పోస్టింగ్‌లతో పాటు బదిలీలు జరిగాయి. ఇన్‌స్పెక్టర్లు ఎ.నందీశ్వర్ రెడ్డి సైబర్ క్రైమ్స్ నుంచి నాచారం పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, వై.రవీందర్ కుషాయిగూడ ట్రాఫిక్-2 నుంచి చర్లపల్లి పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, ఎస్.ఎలక్షన్ రెడ్డిని స్పెషల్ బ్రాంచ్ నుంచి ఉప్పల్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, బి.రాజు సైబర్ క్రైమ్స్ నుంచి పోచారం ఐటీ కారిడార్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, బి.సత్యనారాయణ భువనగిరి రూరల్ పీఎస్ నుంచి మల్కాజిగిరి పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, ఆర్.గోవింద్ రెడ్డి ఇబ్రహీంపట్నం పీఎస్ ఎస్‌హెచ్‌ఓ నుంచి మేడిపల్లి పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, వి.అశోక్ రెడ్డి పోచారం ఐటీ కారిడార్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ నుంచి ఎస్ఓటీ-2, ఎం.కాశీ విశ్వనాథ్ మంచాల్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ నుంచి మీర్‌పేట్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, కె.కిరణ్ కుమార్ మీర్‌పేట్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ నుంచి సైబర్ క్రైమ్, పోస్టింగ్ కోసం వేచిఉన్న పి.అంజనేయులు ఇబ్రహీంపట్నం పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, ఎం.ప్రభాకర్ రెడ్డి నాచారం పీఎస్ ఎస్‌హెచ్‌ఓ నుంచి సైబర్ క్రైమ్, పి.సైదులు మేడిపల్లి పీఎస్ ఎస్‌హెచ్‌ఓ నుంచి స్పెషల్ బ్రాంచ్, బి.రవికుమార్ స్పెషల్ బ్రాంచ్ నుంచి వనస్థలిపురం పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా, వై.మల్లికార్జున్ రెడ్డి చర్లపల్లి పీఎస్ ఎస్‌హెచ్‌ఓ నుంచి సైబర్ క్రైమ్స్‌కు బదిలీ చేస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐసీఎస్ఐ కార్యవర్గం ఎంపిక

తెలుగు యూనివర్సిటీ, జనవరి 18 : ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ - 2024 కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా లక్ష్మీనారాయణ గుప్త గమిని, వైస్ చైర్మన్‌గా మంజిత్ బుచా, కార్యదర్శిగా శిల్పాబంగ్, కోశాధికారిగా పవన్ కంకణి, సభ్యులుగా తంగిరాల లలితాదేవి, అక్షితా సురా నా, ఎ.కార్తిక్, ఎక్స్ అఫీషియో సభ్యులుగా రాజవోలు వెంకటరమణ, మహాదేవి తిరునగరి ఎన్నికైనట్లు చాప్టర్ ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

సీసీ కెమెరాల కమాండ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఆర్ఐ ప్రదీప్ భాష్యం

నిలోఫర్ దవాఖానకు ఎన్ఆర్ఐ చేయూత

- రూ.కోటి వ్యయంతో సీసీ కెమెరాల కమాండ్ సెంటర్, ఏసీలు ఏర్పాటు
- దాతతో కలిసి ప్రారంభించిన దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ):నిరుపేద రోగులు చికిత్స పొందే నిలోఫర్ వంటి దవాఖానలకు సేవ చేయడం భగవంతుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నామని ఎన్ఆర్ఐ ప్రదీప్ భాష్యం అన్నారు. గురువారం దవాఖానలో రూ.కోటి విలువతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ సెంటర్, ఏసీలను దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, సీఎస్ ఆర్ ఎంఓ జ్యోతి, ఆర్ఎంఓ డాక్టర్ రమేశ్ బాబు దాంపురిలతో కలిసి ప్రదీప్ భాష్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపాదించిన దాంట్లో నుంచి కొంత పేద ప్రజలకు దానం చేసినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని అన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ నిరుపేద రోగులు చికిత్స పొందే నిలోఫర్ హాస్పిటల్‌కు సహాయం చేసేందుకు ఎన్ఆర్ఐ ప్రదీప్ భాష్యం స్వయంగా ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఎన్ఆర్ఐ ప్రదీప్ అందచేసిన 288 సీసీ కెమెరాలను స్థానిక నాంపల్లి పోలీసుల సహకారంతో ఐసీయూ బ్లాక్, ఇన్ఫోసిస్, ఏఆర్‌టీ బ్లాక్‌లలో ఏర్పాటు చేశామని, ఈ కెమెరాలన్నింటిని అనుసంధానం చేస్తూ ప్రత్యేకంగా కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కెమెరాలు దవాఖానకు వచ్చిపోయే ప్రతి ఒక్కరిపై నిఘా పెడతాయని, వీటిని 24/7 పర్యవేక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దాత ప్రదీప్ బంధువులు జగదీశ్, సురేశ్, విజయలక్ష్మితో పాటు నాంపల్లి ఏసీపీ సంజీవ్‌కుమార్, సీఐ అభిలాష్, నిలోఫర్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ వేణు, టెక్నికల్ అసిస్టెంట్ షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ దవాఖానకు అమెరికా వైద్యుడి విరాళం

- గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి రూ.50 లక్షలు అందజేత
- డాక్టర్ దివేశ్ అనిరెడ్డిని అభినందించిన గాంధీ దవాఖాన సూపరింటెండెంట్

గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ రాజారావు, ప్రొఫెసర్ శ్రావణ్‌కుమార్‌లకు సామగ్రిని అందజేసిన అమెరికా వైద్యుడు దివేశ్ అనిరెడ్డి

బన్సీలాల్‌పేట్, జనవరి 18 : గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, అమెరికా అధ్యక్షుడు, సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుడు, డాక్టర్ దివేశ్ అనిరెడ్డి, గాంధీ దవాఖానలోని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి రూ.50 లక్షల విలువైన వైద్య పరికరాలను విరాళంగా అందజేశారు. గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్‌ఓడీ, డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్ ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు మాట్లాడుతూ తాను చదువుకున్న కాలేజీ, దవాఖానకు విలువైన సామగ్రిని అందజేసిన దివేశ్ అనిరెడ్డి ఎందరో పూర్వ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రొఫెసర్ పి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో కూడా పలుమార్లు ఇండియా వచ్చే సమయంలో తనకు ఫోన్ చేసి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి అవసరమైన సామగ్రి గురించి అడిగేవారని, అమెరికాలో కొనుగోలు చేసి విమానంలో ఎంతో బరువైన, విలువైన సామాగ్రిని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ సుంకం చెల్లించి, గాంధీ దవాఖానకు వచ్చి ఇవ్వడం ఎంతో అభినందనీయమని అన్నారు. దివేశ్ అనిరెడ్డి మాట్లాడుతూ తాను అమెరికా వెళ్లిన తర్వాత సేవాభావం కలిగిన మిత్రులతో కలిసి తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేశామని అన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, నైపుణ్య శిక్షణ రంగాలలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో మెరుగుపర్చాల్సిన విద్యా వ్యవస్థపై తమ సంస్థ చేసిన పరిశోధన వివరాలను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, ఇండియా అధ్యక్షుడు ఎం.రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినీల్, పలువురు పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

వీహెచ్‌తో కలిసి బ్యాటింగ్ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రారంభమైన రాజీవ్‌గాంధీ క్రికెట్ చాంపియన్ షిప్

గోల్నాక, జనవరి 18 : అంబర్‌పేటలో 23వ రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా అండర్-19 టీ20 డే అండ్ నైట్ చాంపియన్ షిప్ అట్టహాసంగా ప్రారంభమైంది. గురువారం అంబర్‌పేట జలమండలి క్రికెట్ మైదానం వేదికగా క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ చాంపియన్ షిప్‌లో మలేషియా, శ్రీలంక, బెంగళూరు, చెన్నై, మహారాష్ట్ర, మంగళూరు, విదర్భతో పాటు తెలంగాణ జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ శంభుల శ్రీకాంత్‌గౌడ్, సాధిక్ భాషా, అమర్జీత్ కుమార్, ఆధి అవినాశ్, రజనీ కాంత్, కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, బి.కిషన్, రోహిత్, జ్ఞానేశ్వర్ గౌడ్, నారాయణ స్వామి, దిడ్డి రాంబాబు, పులి జగన్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ద బెస్ట్.. టైటాన్స్: బాలకృష్ణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ పోటీలకు హైదరాబాద్ సిద్ధమైంది. స్థానిక గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు పీకేఎల్ హైదరాబాద్ నందే పోటీలు జరుగనున్నాయి. అయితే, లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న టాలీవుడ్ స్టార్ హీరో బాలకృష్ణను లోకల్ టీమ్ తెలుగు టైటాన్స్ గురువారం మర్యాద పూర్వకంగా ఆయన ఇంట్లో కలుసుకుని, శుక్రవారం జరిగే తొలి మ్యాచ్‌కు రావాల్సిందిగా బాలకృష్ణను టీమ్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఆయన టైటాన్స్ టీమ్‌కు ఆల్ ద బెస్ట్ చెప్పారు. తెలుగు టీమ్‌కు అందరు మద్దతుగా నిలువాలని అభిమానులను కోరారు.

డైలీని ఆవిష్కరిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చిక్కడపల్లి, జనవరి 18 : ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై క్యాబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-327(ఐఎన్‌టీయూసీ అనుబంధం) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సభను గురువారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళా భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరై రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డిలతో కలిసి క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జనరల్ ఇ.శ్రీధర్, రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేశ్, ఎం.సురేశ్, పి.మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, మజీద్, మాదవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

21న మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక

కాచిగూడ, జనవరి 18 : మున్నూరు కాపు మహాసభ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపు యువతి, యువకుల కోసం వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం మహాసభ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 (ఆదివారం) ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి కొండ సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే దానం నరేందర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవీందర్, కె.లక్ష్మణ్, ట్రస్ట్ చైర్మన్ ఎం.ఆర్.వెంకట్రావ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివాహ పరిచయ వేదిక చైర్మన్ గోపాల రాధాకృష్ణ, కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్, లింగిశెట్టి హనుమంత్‌రావు, మణికొండ రమేశ్‌కుమార్, ప్రకాశ్, కొంతం సురేశ్ బాబు, కట్టెల సుభాష్, ప్రహలాద్, సదానంద్, శ్రీనివాస్ రావు, జి.సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై కత్తితో దాడి

గోల్నాక, జనవరి 18 : 10వ తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితురాలు ఇంటర్ మరో కాలేజీలో చదవడాన్ని జీర్ణించుకోలేని స్నేహితుడు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. బాగ్‌అంబర్‌పేట్ తురాబ్‌నగర్‌కు చెందిన బాలిక (15) మల్లికార్జున నగర్‌కు చెందిన బాలుడు (17) గత పదేండ్లుగా ఒకే పాఠశాలలో చదువుకున్నారు. 10వ తరగతి పూర్తయిన అనంతరం బాలిక కాచిగూడలోని ఓ కాలేజీలో ఇంటర్ చదువుతుండగా అదే ప్రాంతంలోని మరో కాలేజీలో బాలుడు చదువుతున్నాడు. పదేండ్లు ఇద్దరం ఒకే పాఠశాలలో చదువుకున్నాం.. ఇప్పుడు ఎందుకు వేరువేరుగా చదువుకోవాలనే విషయంలో వారి మధ్యన మాటామాట పెరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన సదరు బాలుడు కత్తితో బాలికపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో బాలికకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న వైద్యశాలకు తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అంబర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓయూలో ఇంగ్లిష్ గ్రామర్‌పై ఉచిత శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 18 : ఉస్మానియా యూనివర్సిటీ సివిల్ సర్వీసెస్ అకాడమీలో ఈ నెల 29 నుంచి ఇంగ్లిష్ గ్రామర్ తరగతులను ఉచితంగా నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ తెలిపారు. అకాడమీ అడ్వైజరీ కమిటీ నిర్ణయం మేరకు విద్యార్థుల ప్రయోజనం కోసం పోటీ పరీక్షలకు ఉపయోగపడే ఇంగ్లిష్ గ్రామర్, వెకాబులరీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులను నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 6:30 నుంచి 8 గంటల వరకు ఈ తరగతులు జరుగుతాయని చెప్పారు. దీనికి సంబంధించిన దరఖాస్తులను ఓయూ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 24లోగా తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 18 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ తదితర కోర్సుల వన్‌టైం చాన్స్ (బ్యాక్‌లాగ్), రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాలల నుంచి మూడు వారాల తరువాత నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాలపై అనుమానం ఉన్నవారు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి, వచ్చే నెల 19వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవాబు పత్రాల నకలు కావాలంటే ఒక్కో పేపర్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించి వచ్చే నెల 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మెస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 22 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు.

ఈట్ హెల్తీ.. లైవ్ హెల్తీ

- ఫిబ్రవరి 11న 'రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్'పై అవగాహన
- ప్రతి ఒక్కరికీ 1 లీటర్ ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ పంపిణీ

జూబ్లీహిల్స్, జనవరి 18 : 'ఈట్ హెల్తీ.. లైవ్ హెల్తీ' నినాదంతో నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో ఫిబ్రవరి 11న ''రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్'' ప్రచార కార్యక్రమాన్ని ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్, సేవా భారతి.. తెలంగాణ సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రైస్ బ్రాన్ ఆయిల్‌ను ఉపయోగించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు 'ఈట్ హెల్తీ.. లైవ్ హెల్తీ' క్యాంటర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఫ్రీడమ్ ఆయిల్ క్యాంటర్‌లో తమ పేర్లు నమోదుచేసుకుని రూ.120 విలువైన 1 లీటర్ ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్‌ను ఉచితంగా పొందవచ్చని ఫ్రీడమ్ ఆయిల్స్ మార్కెటింగ్ జీఎం చేతన్ పింపాల్‌ఖుటే తెలిపారు. ఈ మేరకు ఫ్రీడమ్ ఆయిల్ క్యాంటర్లను సేవా భారతి ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సేవా భారతి సౌజన్యంలో నిర్వహిస్తున్న ఈ 8వ ఎడిషన్‌లో సమాజంలో వెనుకబడిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధికి మద్దతు ఇవ్వడం గర్వకారణంగా ఉందన్నారు.

భవిష్యత్తులో డిజిటల్ విద్యకు మరింత ప్రాధాన్యం

- రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం
- ఓయూలో డిజిటల్ ఎడ్యుకేషన్‌పై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్

కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 18 : ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆధునిక విద్యావిధానాలు అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం అన్నారు. భవిష్యత్తులో డిజిటల్ విద్యకు మరింత ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసర్చ్ సెంటర్ (ఈఎంఆర్‌సీ)లో 'డిజిటల్ ఎడ్యుకేషన్ అండ్ మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్ (మూక్స్)'పై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటేశం హాజరై ప్రారంభించి ప్రసంగించారు. టెక్నాలజీ, ట్రెడిషన్స్, టాలెంట్‌లలో తెలంగాణ ముందుందన్నారు. దేశవ్యాప్త డిజిటల్ విద్య అవసరాల్లో నాలుగో వంతు తెలంగాణ తీర్చనున్నదని చెప్పారు. ఈఎంఆర్‌సీ ద్వారా డిజిటల్ విద్యావిధానానికి ప్రాధాన్యత ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కన్సార్షియం ఫర్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ (సీఈసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ జగత్ భూషణ్ నడ్డా మాట్లాడుతూ 2035 వరకు విద్యార్థుల స్కూల్ నమోదు నిష్పత్తిని 50శాతానికి పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కొద్ది రోజుల్లోనే డిజిటల్ యూనివర్సిటీ స్థాపన మన దేశంలోని విద్యావ్యవస్థను మరో దశకు తీసుకెళ్తుందని అభిప్రాయపడ్డారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అధ్యాపకులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని డిజిటల్ టీచింగ్ అండ్ లర్నింగ్‌కు మారాల్సిన అవసరాన్ని వివరించారు. ఈఎంఆర్‌సీ డైరెక్టర్ పి.రఘుపతి మాట్లాడుతూ విద్యార్థులకు అందించే పాఠ్యాంశాలను డిజిటలైజ్ చేసేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఓయూ యూజీసీ డీన్ ప్రొఫెసర్ జి.మల్లేశం, ప్రొఫెసర్ రాములు, ప్రొఫెసర్ రాజేంద్రనాయక్, ప్రొఫెసర్ శ్రీనగేశ్, ప్రొఫెసర్ ప్యాట్రిక్ పాల్గొన్నారు.

గంజాయిని సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 18: గంజాయి మొక్కలను సాగు చేస్తున్న వ్యక్తిని వారాసిగూడ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం, వెస్ట్ పార్సిగుట్టకు చెందిన రాహుల్ రాజ్(29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. అతడికి గంజాయి తాగే అలవాటు ఉంది. తనకు అవసరమైనపుడు గంజాయి దొరకడం గగనంగా మారింది. ఈ నేపథ్యంలో ఎండు గంజాయిలోని విత్తనాల ద్వారా కూడా గంజాయి మొక్కను పెంచవచ్చని తెలుసుకున్నాడు. దాంతో నాలుగు నెలల క్రితం నుంచి గంజాయి సాగుచేయడం ప్రారంభించాడు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి మూడు గంజాయి మొక్కలు, కొన్ని గంజాయి విత్తనాలు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారాసిగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలతో నిందితుడు

ఆర్యుమాన్ కుమార్‌ను అభినందిస్తున్న యూనివర్సిటీ ప్రిన్సిపల్ రామకృష్ణ

ఆర్యుమాన్‌కు అభినందనలు

మాదాపూర్, జనవరి 18 : విద్యార్థులను నాయకులుగా, ఆవిష్కర్తలుగా, సమస్యలను పరిష్కరించే నేర్పరులుగా తీర్చిదిద్దాలనే దార్శనికతతో ఏఆర్. కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తున్నదని వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవిష్ అన్నారు. ఆర్యుమాన్ కుమార్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కేఎల్‌హెచ్ హైదరాబాద్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థి ఆర్యుమాన్ కుమార్ చౌదరి తన స్టార్టప్ ఓస్కోవ్ల్ అండ్ కో సహయంతో ఏరియల్ నావిగేషన్ ద్వారా ఏఐ ఆధారిత ఫ్లైట్ కంట్రోలర్‌ను ఆవిష్కరించి తన నైపుణ్యతను చాటుకున్నాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామకృష్ణ ఆర్యుమాన్‌కు అభినందనలు తెలిపారు.

నుమాయిష్‌లో నృత్యాలు

అబిడ్స్, జనవరి 18 : అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు విచ్చేసే సందర్శకులను అలరించేందుకు గాను ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వీఐపీ క్లబ్ రిసెప్షన్ కమిటీ కన్వీనర్, కల్చరల్ కమిటీ సభ్యురాలు వనం ఉష పేర్కొన్నారు. ప్రతినిత్యం నృత్యా లు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.